క్లుప్తంగా

నేడు శ్రీవారి కల్యాణం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శ్రీలక్ష్మీగోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం 10గంటలకు శ్రీవారి కల్యాణం, అన్నసమారాధన, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ వేడుకలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రేపు శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

మోతీనగర్: శ్రీవివేకానందనగర్‌లో శ్రీభూనీళా సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 7గంటలకు కాలనీ మాఢవీధుల్లో రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవం కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

బెల్లి లలితకు నివాళి



నివాళులలర్పిస్తున్న మల్లేష్‌యాదవ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: ఉద్యమ గొంతుకగా, తెలంగాణ కళా సమితి కన్వీనర్‌గా, మలిదశ ఉద్యమానికి సమిధగా తన రక్తాన్ని దారపోసిన వీర వనిత బెల్లి లలిత అని కూకట్‌పల్లి యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గండి మల్లేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం బెల్లి లలిత వర్ధంతిని యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

భాగ్యనగర్‌కాలనీ: ఓ యువతి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనాడు కాలనీలో పెరిమి దీలిప్ కుమార్ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. తన కూతురు పి. శశిప్రియ (24) ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పుడప్పుడు బయటకు వెళ్లి కాసేపటికి తిరిగి వస్తుంది. ఈనెల 25వ తేదీన బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఆమె మానసిక పరిస్థితి బాగుండదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు. ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఈ మేరకు ఆమె తండ్రి దిలీప్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మందులను అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం శివశంకర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మల్లారెడ్డి ఆస్పత్రి వారి సహకారంతో ప్రతి శుక్రవారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ, బస్తీల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి ఆస్పత్రి ప్రతినిధి డా. రవికుమార్, స్థానికులు బసవరాజ్, శ్రీను, విజయ్, అశోక్, బాబా, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి

బాలానగర్: డివిజన్ పరిధిలోని డీఎస్‌కాలనీలో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటికీ లేదు నీరు!



మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద క్యూ





చంకలో పిల్లవాడిని ఎత్తుకొని నెత్తిన నీటి బక్కెట్, బిందలు పెట్టుకొని వెళ్తున్న మహిళ్లు

రెండు దశాబ్దల క్రితం చాలా ప్రాంతాల్లో పైనున్న దృశ్యాలు ప్రతి వేసవిలో కనిపించేవి. ప్రస్తుతం మూసాపేట మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న వాటర్‌ట్యాంక్ వద్ద ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని ప్రభుత్వం అంటోంది. 'మరి వీళ్లేంది ఇలా బిందెల్లో నీళ్లు తీసుకెళ్తున్నారు'అని అనిపిస్తోంది కదా. అయితే అసలు విషయానికి వద్దాం. మూసాపేటలోని పలు ప్రాంతాల్లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల కారణంగా 15రోజుల్లో రెండు సార్లు తాగునీటి సరఫరాను నిలిపేశారు. దీంతో అక్కడి ప్రజలకు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంక్ నుంచి నీటిని తెచ్చుకోక తప్పడం లేదు. ప్రస్తుతం తాగునీరు వస్తున్నప్పటికీ లోప్రెషర్‌తో వస్తోంది. అంతే కాకుండా మధ్యాహ్న సమయంలో నీరు సరఫరా చేస్తుండటంతో నీటిని పట్టుకోలేకపోతున్నారు. ప్రతిరోజూ ఉదయం వాటర్ ట్యాంక్ వద్ద తాగునీటి కోసం ఎగబడాల్సి వస్తోంది. లోప్రెషర్ ఉన్న ప్రాంతాల్లో కనీసం వాటర్ ట్యాంకర్‌తో అయిన నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

– మూసాపేట



వాటర్ ట్యాంక్ నుంచి నీటిని మోసుకెళ్తున్న మహిళలు



కార్పొరేటర్ల గల్లీ గల్లీ పర్యటన

- సమస్యలు తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు
- అప్పటికప్పుడు పలు సమస్యలను పరిష్కరించిన అధికారులు
- ప్రాధాన్యత క్రమంలో మిగతా సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడి



బాలాజీనగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిదిలోని చిత్తారమ్మ నగర్, ముష్కిపేట్, ప్రగతినగర్‌లలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బస్తీ, కాలనీల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా 8వ రోజు పాదయాత్ర చేపట్టి ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తున్నానని తెలిపారు. అన్ని విభాగాల అధికారులతో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో పూర్తి చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసినట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనితా శ్రీపాద, డివిజన్ అధ్యక్షురాలు అరుణ శెట్టి, ఎల్లేష్, బుచ్చిరాములు, భూమండ్ల అశోక్, అంజిగౌడ్, బందప్ప, అన్నపూర్ణ, జగదేవి, ఈదులకంటి అశోక్ కుమార్, కొడిచేర్ల వినోద్, యు. కృష్ణా, సంజీవరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగనగర్‌లో సమస్యలను పరిష్కరించాం



పాండురంగానగర్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట డివిజన్ పాండురంగనగర్, వీకర్ సెక్షన్ కాలనీల్లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముందుచూపు, పట్టుదలతో ఈ రెండు కాలనీల్లో దాదాపు 90శాతం మేర పనులు పూర్తి అయ్యాయని అన్నారు. పాదయాత్రలో స్థానికులు తెలిపిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉదయ్, రవీందర్, లక్ష్మారెడ్డి, తుకారాం, రాజ్‌కుమార్, సురేందర్, వంశీ, యాదగిరి, నరేష్, శేఖర్, అశోక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన ...



నందమూరినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ నందమూరి నగర్‌లో చేపడుతున్న యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శుక్రవారం జీహెచ్‌యంసి అధికారులతో స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. యూజీడీ పైపులైన్, వరద నీటి కాలువ పనులు, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

నిర్మాణ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి

భాగ్యనగర్‌కాలనీ: ఇంద్రాహిల్స్‌లో జరుగుతున్న నూతన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులను శుక్రవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో సమస్యలు తెలత్తకుండా నిర్మాణ దశలోనే తగు జాగ్రత్తలు తీసుకొని డ్రైనేజీ వ్యవస్థను నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలన్నారు.



ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



రాయదుర్గం: రాబోయే రోజుల్లో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను మరింత విస్తృతపర్చాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ పరిపాలనా భవనంలోని తన చాంబర్‌లో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) వాలంటీర్లు అరుణ అనిల్‌కుమార్, సమీరాబిందు, జల్లిఆకాష్, సిద్ధాంత్‌శుక్లాలను అభినందించి వారిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో క్యాంపస్‌లోనే కాకుండా వెలుపల కూడా అనేక ఎన్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ బీ కృష్ణయ్య, ఇతర అధికారులను ఆదేశించారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట చైతన్య బస్తీకి చెందిన ఝాన్సీ (25) తలిదండ్రులతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. సొంత ఊరిలో పండుగ ఉందని తల్లిదండ్రులు ఊరుకి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఝాన్సీ సీలింగ్ ప్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఝాన్సీ కంపెనీకి రాకపోవడంతో ఆమె బావ బాబురావుకి కంపెనీ నుంచి ఫోన్ వెళ్లింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూడగా ఝాన్సీ ఉరేసుకొని కనిపించింది. పక్కింటి వారి సహాయంతో ఝాన్సీని కిందకి దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఏడాది క్రితం ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి బాలాజీనగర్‌లోని విజయదుర్గ టిఫిన్ సెంటర్ వద్ద అపస్మారకస్థితిలో పడిపోయి స్థానికులకు కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు స్పందించారు.. మరమ్మతులు చేపట్టారు



మోతీనగర్: మోతీనగర్ ప్రధాన రోడ్డు సమీపంలో కొన్ని రోజులుగా పొంగుతున్న డ్రైనేజీ సమస్యపై శుక్రవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. శుక్రవారం మూసాపేట జలమండలి డీజీఎం రవి, మేనేజర్ విలియం ప్రకాష్ డ్రైనేజీకి మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, జలమండలి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోవాలి



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, కోచ్ శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: వేసవి కాలంలో ప్రభుత్వం నిర్వహించే సమ్మర్ క్యాంపులను ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శుక్రవారం గాయత్రినగర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో కరాటే మాస్టర్ ఏ.శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపులో విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నప్పుడు తనను తాను రక్షించుకోవడానికి త్వైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జాహీద్ షరీఫ్ బాబా, సంజీవరెడ్డి, పార్వతమ్మ, వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లేష్, బ్రహ్మ, మనెమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీఓ.59ను సద్వినియోగం చేసుకోవాలి

మల్కాజ్‌గిరి ఆర్‌డీఓ మల్లయ్య



జీఓ.59పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ మల్లయ్య, కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జీఓ.59ను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఆర్‌డీఓ మల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కమ్యూనిటీహాలులో జీఓ.59పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సబిహా బేగం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మల్లయ్య మాట్లాడుతూ.. జీఓ.59 కింద అందిన రుసుమును సకాలంలో చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన రుసుమును సకాలంలో చెల్లించి యాజమాన్య హక్కు పొందాలన్నారు.పదేళ్ల కిందట జీఓ.59 ప్రకారం చెల్లించిన ఇళ్లకు విచారణ చేపట్టి హద్దులను నిర్ణయించి సేల్ డీల్ టైటిల్ హక్కు కల్పిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి మండలం తహసీల్దార్ గోవర్ధన్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, నాయకులు సుంకన్న, పార్వతమ్మ, లక్ష్మీరాజు తదితరులు పాల్గొన్నారు.

జీఓ.59 కింద స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్



పాపిరెడ్డినగర్‌లో జీఓ.58, 59లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గోవర్ధన్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండల పరిధిలోని నివాసితులు ప్రభుత్వం కల్పించిన 58 జీవోతో తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని శుక్రవారం కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. జీవో 58, 59లపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను, దరఖాస్తు చేసుకున్న నివాసితులకు ప్రభుత్వం పంపించిన నోటీస్‌లో వచ్చిన అధిక రుసుం చెల్లించేందుకు పడుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయం కమిటీ హాలులో బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సందేహాలను నివృత్తి చేశారు. రెండు లక్షలు ఆపై ఉన్న డబ్బులను చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలన్నారు. రూ.10 – 20 లక్షల ఆపైన చెల్లించాలని నోటీసులు అందుకున్న వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగ్గించే వెసులుబాటును కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు పేర్ని ధర్మారావు, దొడ్ల రాం రెడ్డి, కన్నారావు, ఎం. వెంకటరెడ్డి, ఎం. కనకరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసరావు, భిక్షపతి, తిరుపతిరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.